

ఎలాంటి విద్యుత్ కోతలు లేవు

కుభీర్, ఫిబ్రవరి, 24: విద్యుత్ సరఫరాలో ఎలాంటి కోతలు లేవని నిర్మల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జయంత్‌రావు చౌహాన్, కుభీర్ ఏఈ అజీమొద్దీన్ తెలిపారు. శనివారం ఏఈ విలేఖరులతో మాట్లాడారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఏమైనా సాంకేతిక లోపాల కారణంగా నిలిచిన వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కుభీర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ప్రజావేదికల సమావేశంలో రాత్రి కేవలం 10 నిమిషాల పాటు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ సమస్య మండల కేంద్రంలోని నయాబాదిలో ఓ వ్యక్తి విద్యుత్ తీగలకు వైర్ వేయడం మూలంగా ఫ్యూజ్ పోయి సరఫరా నిలిచిందన్నారు. తమ సిబ్బంది 10 నిమిషాల్లోనే సరఫరా పునరుద్ధరించారని పేర్కొన్నారు.

జిల్లాలో తగ్గుతున్న మిరపసాగు



ముథోల్, ఫిబ్రవరి 24 : షడ్రుచులలో ఎన్ని రుచులున్నా కారం రుచి వేరు. నిత్యం వాడుకలలో కారందే ప్రధానపాత్ర. పోపుడబ్బాలో మిరప గింజలు మొదలు కొని ఎండుమిర్చి పొడిరూపంలో మన వంటకాల్లో విరివిగా వాడుతుంటారు. ఊరగాయలు మొదలు నిత్యం వండే కూరల వరకు మిర్చి కావాల్సిందే. దీనికోసం ప్రతిగృహిణి ఎండాకాలం వచ్చేసరికి అప్రమత్తమవుతుంటారు. మంచిసరుకు గిట్టుబాటు ధర కోసం ముథోల్‌కు వస్తారు. కొన్ని సంవత్సరాలుగా ముథోల్ ప్రాంతంలోని ఎండుమిర్చి అంటే మూడు జిల్లాల్లో ప్రసిద్ధి. మహారాష్ట్ర నుంచి కూడా ఇక్కడికి వచ్చి మిర్చి కొనుగోలు చేస్తారు. ఎండాకాలంలో మిర్చి కొనుగోలు దారులతో సందడిగా ఉంటుంది. కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో మిరపసాగు గణనీయంగా తగ్గినా ఇక్కడి వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని వ్యాపారం సాగిస్తుంటారు. ముథోల్ కారం పొడి అంటే మంచి నాణ్యతగా పేరుంది. అయితే వినియోగదారులు సంవత్సరానికి సరిపడా మిర్చి కొనుగోలు చేసి ఇక్కడి మిషన్‌లో పొడి చేయించుకుని తీసుకెళ్తుంటారు. మిర్చిసాగులో చీడపీడలు రావడం రైతులకు గిట్టుబాటు లేక పోవడం, కూలీల కొరత, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలు పంటదిగుడిపై ప్రధాన ప్రభావాన్ని చూపాయి. క్రిమిసంహారకాలు వాడాలంటే ఇక రైతులకు అంత ఆర్థిక పరిస్థితి లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఎండుమిర్చి పంటవిస్తీర్ణం తగ్గిపోయింది. ఈ సంవత్సరం కొద్దిగా జిల్లాలోని సారంగాపూర్, కుంటాల, లోకేశ్వరం మండలంలో సాగు పెరిగిందని చెప్పుకోవచ్చు. ఇదిలా ఉండగా స్థానిక వ్యాపారులు వివిధ ప్రాంతాల్లో ఎండుమిర్చి కొనుగోలు చేసి తీసుకువచ్చి స్థానికంగా మిర్చి మీదే అమ్మకాలు జరుపుతున్నాయి. ఇప్పటికే స్థానిక మిర్చి పైనే వినియోగదారులు ఆసక్తి చూపుతున్నా తగినంత సరుకు దొరకడం లేదు. జిల్లా అవసరాలకు తగినంత కూడా సరుకు ఇక్కడ పండడం లేదు. వినియోగదారులు కొందరు ఈ సీజన్‌లో ధర్మాబాద్ మార్కెట్‌కు వెళ్తున్నారు.

- పంటలను పట్టి పీడిస్తున్న చీడపీడలు
- నష్టాలతో పంట సాగును తగ్గించుకుంటున్న రైతులు
- జిల్లాలో కేవలం 850 ఎకరాల సాగు
- ఖమ్మం, వరంగల్, సోలాపూర్ నుంచి తెస్తున్న వ్యాపారులు
- ఎగిసిపడుతున్న ఎర్ర బంగారం
- ధర కిలో రూ. 240

ప్రస్తుత సీజన్‌లో ఎండుమర్చి ధర నానాటికి పెరిగిపోతుంది. ముథోల్‌లో ఎండుమర్చి పొడి చరసుకునేందుకు సందడి మొదలైంది. జిల్లా పరిధిలోని ముథోల్ ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గంలోని ఈ సీజన్‌లో కేవలం 450 మంది రైతులు 825 ఎకరాల మిర్చి పంట సాగైందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి అంజిప్రసాద్ తెలిపారు.



ఎండుమిర్చిని పొడిగా మార్చే పల్వరైజర్

చీడపీడలతో తగ్గిన దిగుబడి

ఎండుమిర్చి సాగులో రైతులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి పంట తొలిదశలో రసం పీల్చేపురుగు ఉధృతి తీవ్రంగా ఉంది. దీంతో మందుల వాడకం ఎక్కువైంది. మరోపక్క ముడత రోగం వ్యాప్తి చెందడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు మిర్చిసాగుపై మక్కువ చూపటం లేదు. దీంతో మిర్చిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందని చెప్పు కోవచ్చు. 2020లో జిల్లాలో మిర్చిసాగు 110 మంది రైతులు 67 ఎకరాల 21 గుంటలు సాగుచేయగా, 2021లో 47 మంది రైతులు 46 ఎకరాల 13 గుంటలు సాగు చేశారు. 2023లో 220 మంది రైతులు 450 ఎకరాల్లో సాగు చేయగా ఈయేడు 450 రైతులు 825 ఎకరాలు సాగు చేశారంటే ఈ ఏడు కొద్ది మట్టుకు మిర్చిసాగు పెరిగింది. అది కూడా జిల్లాలోని సారంగాపూర్, కుంటాల, లోకేశ్వరం మండలాల్లో కొద్ది మట్టుకు పెరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. చీడపీడల మూలంగా పెట్టుబడి పెట్టి మిరప పంటలు సాగుచేసిన రైతన్నలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో రైతులు సుమారు గత నాలుగు ఐదు సంవత్సరాల నుంచి మిరప సాగు గణనీయంగా తగ్గింది. సుమారు 7-8 సంవత్సరాల క్రితం జిల్లాలో మిరపసాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపేవారు. చీడపీడల నేపథ్యంలో రైతులు ఈ పంట సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ సంవత్సరమే కొద్దిగా సాగు విస్తీర్ణం పెరిగింది.

ఎగిసి పడుతున్న ఎర్ర బంగారం ధరలు

ప్రస్తుతం ముథోల్‌లో తేజ రకం ఎండుమర్చి కిలో ధర 240 పలుకుతుంది. సాధారణరకం ధర కిలో రూ.210 నుంచి 230 వరకు పలుకుతుంది. ఇక్కడి వ్యాపారులు మహారాష్ట్రలోని సోలాపూర్ అలాగే మన తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్ ప్రాంతం నుంచి ఎండుమిర్చి కొనుగోలు చేసి ముథోల్‌లో విక్రయిస్తున్నారు. నిర్మల్ జిల్లా నుంచి కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర నుండి సైతం వినియోగదారులు వచ్చి ఎండుమిర్చి కొను గోలు సైతం చేస్తారు. ఈ ఏడు కూడా కిలో ఎండుమిర్చి ధర 230 నుంచి 240 వరకు పలుకుతుంది. రెండవరకం మిర్చి 210 నుంచి 230 వరకు పలుకుతుంది. జిల్లాలోని భైంసా, నిర్మల్ ప్రాంతాలలో ఎండుమిర్చి విక్రయాలు అంతంత మాత్రమే. ముథోల్ ప్రాంతంలో మెండుగా జరుగుతాయి. ఏదిఏమైనా మునుముందు ఎండుమిర్చి ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

రైతులకు ప్రోత్సాహం ఏది ?

ప్రస్తుతం వాణిజ్య పంటలు పత్తి, సోయా ఆధిపత్యాన్ని చూపుతున్నాయి. స్థానిక విత్తనంపంట కాపాడుకోవడం కత్తిమీద సామే. స్థానిక అవసరాలకు తగ్గినట్లు తక్కువ క్రిమిసంహారకాలతో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం వాడి ఎండుమిర్చి పంటను పండించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనికి తగిన ఆర్థిక పరిజ్ఞానం అన్నదాతలకు వ్యవసాయశాఖ అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా శివదత్త
సాయినాథ ఆలయ వార్షికోత్సవం



మునిపెల్లిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 24 : మండలంలోని మునిపెల్లి గ్రామంలో గల శివదత్త సాయినాథ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ చేశారు. శివదత్త సాయినాథ విగ్రహాలకు పాలాభిషేకం చేసి నూతన వస్త్రాలను అలంకరించారు. హారతి అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి రమేష్‌చారి, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం



వీరబ్రహ్మేంద్రస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 24 : మండలంలోని మాడేగాంలో మాఘ పూర్ణిమను పురస్కరించుకొని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు కట్నకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాడేగాం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

..కల్యాణంలో పాల్గొన్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 24 : పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 39వ కల్యాణోత్సవానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు హాజరయ్యారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనను ఈ సందర్భంగా సన్మానించింది. నాయకులు కొట్టే శేఖర్, పద్మాకర్, శ్రీనివాస్, నగేష్, ఎస్. వికాస్, తదితరులున్నారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి
బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు



ఖానాపూర్‌లో లాస్యనందిత ప్లెక్సీకి
పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 24 : కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు తాళ్లపెల్లి రాజగంగన్న అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లాస్య నందిత చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. తన తండ్రి సాయన్న మరణం నుండి ఆ కుటుంబం కోలుకోకముందే ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మృతి చెందడం ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజ గంగన్న, వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, మాజీ జడ్పీటీసీ రాము నాయక్, తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, శనిగారపు శ్రావణ్, కొక్కుల ప్రదీప్, వెంకటప్పయ్య, దివాకర్, ప్రసాద్, నేత శ్యామ్, రమేష్, మహేష్ గోపాల్, నర్సయ్య, ఇర్ఫాన్, మణికంఠ, లక్ష్మణ్, సుమన్, రామిడి మహేష్, చింటూ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులను ఫారెస్ట్ అధికారులు
ఇబ్బంది పెట్టడం సరైనది కాదు



గిరిజనులతో మాట్లాడుతున్న మంచికంటి లక్ష్మణ్

పెంబి, ఫిబ్రవరి 24 : గిరిజనులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టడం సరైనది కాదని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు మంచికంటి లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని కోరకంటి, సూర్య గౌడ, అంకెనా, రాయదారి, పోచంపల్లి, పస్పుల తదితర గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక తాత్కాలిక రోడ్డు నిర్మించుకుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంచికంటి లక్ష్మణ్ మాట్లాడుతూ... గిరిజనులకు రోడ్డు సౌకర్యం లేక అనే ఇబ్బందులు పడుతున్నారని, తాత్కాలిక రోడ్డు నిర్మించుకుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం సరైనది కాదని, అలాగే అటవీ ప్రాంతానికి రైతులు మేకలు మేపడానికి వెళ్తుంటే ఫారెస్ట్ అధికారులు తరుముతున్నారని, రైతులపై దురుసుగా మాట్లాడుతున్నారని ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారుల తీరును మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు లక్ష్మణ్, గంగారాం, జంగు, మాన్కు, తుకారాం, తదితరులున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 24 : నో బ్యాగ్ డేను పురస్కరించుకొని దిలావర్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. 8, 9వ తరగతుల విద్యార్థులకు వివిధ ప్రభుత్వశాఖల పనితీరుపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. పోలీసుశాఖపై ఎస్సై సుమాంజలి, పంచాయతీరాజ్ శాఖపై ఎంపీవో అజీజ్‌ఖాన్, రెవెన్యూశాఖపై తహసీల్దార్ స్వాతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్, పోశెట్టి, అంబాజీ, రమేష్‌లు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయండి



హాజరైన చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 24 : జిల్లాలో ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు జరిగే ఇంటర్ పరీక్షలతో పాటు మార్చి 18 నుంచి జరిగే పది పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షలకు 23 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 13,345 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. టెన్త్ విద్యార్థులకు 47 కేంద్రాలున్నాయని తెలిపారు. పరీక్షలు ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతాయన్నారు. ఎటువంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు సజావుగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతాల నుంచి పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఆయా రూట్‌లలో బస్సులు నడిపించాలన్నారు. కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. సకాలంలో విద్యార్థులు కేంద్రాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. పూర్తి సమయం అయిన తరువాత బయటకు వదలాలన్నారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరాదని ఆదేశించారు. పటిష్ట బందోబస్తు నడుమ జవాబు పత్రాలు సంబంధిత కేంద్రాలకు తరలించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఐవో పరుశరాం, డీఆర్‌వో గంగయ్య పాల్గొన్నారు. పరీక్షల చీఫ్ సూపరిండెంట్లు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

పల్స్ పోలియోకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మార్చి 3న జిల్లాలో పల్స్‌పోలియో నిర్వహణ కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శనివారం నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కల మందు వేయాలన్నారు. పట్టణ పరిధిలో 88, గ్రామీణ ప్రాంతాల్లో 543 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 86,290 మంది చిన్నారులను గుర్తించినట్లు చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. ఆశా, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాలు చురుగ్గా పాల్గొనాలన్నారు. మారుమూల ప్రాంతాలు, సంచార జాతులు, ఇటుక బట్టీలలో, నిర్మాణ ప్రాంతాల్లో నివసించే వారికి తప్పనిసరి పోలియో మందు వేయాలన్నారు. ఈ సమావేశంలో సర్వేలైన్స్ మెడికల్ అధికారి డాక్టర్ అతుల్, అదనపు కలెక్టర్లు డీఆర్‌వో, జిల్లా వైద్యాధికారి ధనరాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన ఇరిగేషన్ ఈఎన్‌సీ బృందం

- ప్రాజెక్టు వద్ద జరుగుతున్న పనుల పరిశీలన
- ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులపై అధ్యయనం చేసిన నిపుణులు
- మే నెలలోపు కడెం ప్రాజెక్టు భద్రతలకు సంబంధించిన పనులు పూర్తి చేస్తామని వెల్లడి



కడెం ప్రాజెక్టును పరిశీలిస్తున్న
ఇరిగేషన్ ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్, తదితరులు



నీటి మట్టం పరిశీలిస్తున్న అధికారులు

ఖానాపూర్, ఫిబ్రవరి 24 : గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కడెం ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఎన్‌సీ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రస్తుతం ప్రాజెక్టు స్థితిగతులపై ఈఎన్‌సీ జనరల్ అనిల్ కుమార్, సీఈ టి. శ్రీనివాస్, ఎస్ఈ సుశీల్‌కుమార్, క్వాలిటీ కంట్రోల్ ఈఈ గోవర్ధన్, మధుసూదన్‌రెడ్డిలతో కూడిన బృందం అధ్యయనం చేసింది. అనంతరం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ... గత వర్షాకాలంలో వచ్చిన భారీ వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్టు మరమ్మతు పనులు నిర్వహించేందుకు ఇదివరకే టెండర్ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే కడెం ప్రాజెక్టు సేఫ్టీకి సంబంధించిన పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం కడెం ప్రాజెక్టు వద్ద చేపట్టాల్సిన పనులన్నింటినీ గుర్తించినట్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మెకానికల్ బృందంతో కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కడెం ప్రాజెక్టు వద్ద నిర్వహించాల్సిన పనులను మెకానికల్ బృందానికి తెలియజేసి పనులను ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. వారి వెంట స్థానిక ప్రాజెక్టు అధికారులు ఏఈఈ రవి కుమార్, తదితరులున్నారు.

మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ పోస్టులకు దరఖాస్తు చేయండి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 24 : నిర్మల్ జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని హెల్త్‌వెల్నెస్ సెంటర్‌లో మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ల నియామకం కోసం ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 2లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ఒక ప్రకటనలో కోరారు. నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేపట్టిందన్నారు. అంతర్జాలంలో దరఖాస్తు ఫారం డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. 15 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్ 2020లో పూర్తి చేసినవారు, జీఎన్ఎం ఆరు నెలల సీపీసీహెచ్ బ్రిడ్జ్ కోర్స్ ఇగ్నో ద్వారా పూర్తిచేసినవారు అర్హులన్నారు. దరఖాస్తులు జిల్లా కలెక్టర్ సముదాయంలో ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



అభిలాష్ మృతదేహం

భైంసా, ఫిబ్రవరి 24: భైంసా - నిర్మల్ జాతీయ రహదారి మార్గంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలోని వంతెన వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసా పట్టణానికి చెందిన ప్రైవేట్ యువ ఉద్యోగి ఒకరు మృత్యువాత పడ్డారు. భైంసా రూరల్ పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ... పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన అభిలాస్ (35) శుక్రవారం రాత్రి నిర్మల్ నుంచి భైంసాకు తన మిత్రుడు ఆనంద్‌రావ్ (39)తో కలిసి ద్వి చక్ర వాహనంపై భైంసాకు వస్తుండగా ప్రమాదం బారిన పడ్డారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం వానల్‌పాడ్ సమీపంలో అదుపుతప్పి వంతెనకు ఢీకొట్టుకుంది. ఈ ఘటనలో అభిలాష్ తలకు తీవ్ర గాయాలవ్వగా ఆనంద్‌రావ్ చేయి విరిగింది. క్షతగాత్రులిద్దరిని ప్రమాద స్థలి నుంచి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇందులో అభిలాష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్య సేవల కోసం గాను నిజామాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన అర్ధరాత్రి వేళలో మృతి చెందాడు. ఇక మరో బాధితుడు ఆనంద్‌రావ్ భైంసాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు అభిలాష్‌కు భార్యతో పాటు ఐదు సంవత్సరాల కూతురు, మూడు నెలల వయస్సు గల కుమారుడున్నారు. మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా భైంసా రూరల్ పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

భైంసా రూరల్, ఫిబ్రవరి 24 : మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన సోనాలి దేవన్న(56) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబ కలహాల వలన వారం రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబికులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సాయంత్రం గ్రామశివారులోని చెట్టుకు ఉరి వేసుకొని కనిపించడంతో స్థానికులు చూసి కుటుంబికులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

317 జీవోపై
సబ్ కమిటీ ఏర్పాటు హర్షణీయం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 24 : 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయమని సీపీఎస్ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో బాధితుల ఆవేదన అర్థం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌కమిటీ ఇచ్చే సిఫారసులతో బాధితులకు న్యాయం జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు దూర ప్రాంతాల్లో పని చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

'హీరాసుక్క జయంతిని జయప్రదం చేయాలి'

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 24: ఈనెల 26న మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించే గోండి ధర్మ గురు హీరాసుక్క జయంతిని ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ ప్రధాన్ సమాజ్ మండల అధ్యక్షుడు గేడం భారత్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26న ఉదయం 11 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లాస్థాయిలో హీరాసుక్క జయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. జయంతిని కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఆదివాసీ పెద్దలు, యువకులు, ఉద్యోగస్తులు, మేధావులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ గేడం జ్ఞానేశ్వర్, మడావి విశ్వనాథ్, సోయం రాందాస్, కనక రజనీకాంత్, సోయం మురహరి, గేడం సోనేరావు, మడావి లక్ష్మణ్, తదితరులున్నారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు



ఆర్టీసీ బస్సుల్లో తిరుగు ప్రయాణమైన భక్తులు



ఆర్టీసీ ప్రాంగణానికి వెళ్తున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి తల్లులకు మొక్కుతున్న భక్తులు

చివరి రోజూ.. అదే జోరు..

- చివరిరోజూ మేడారానికి పోటెత్తిన భక్తులు
- తల్లులను దర్శించుకున్న స్పీకర్
- ప్రశాంతంగా దేవతల వనప్రవేశం
- ముగిసిన నాలుగు రోజుల జాతర
- ఊపిరి పీల్చుకున్న అధికారులు



చిన్నారికి జంపన్న జలాలతో పుణ్యస్నానం..



తిరుగుప్రయాణంలో బై బై చెప్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు చివరి రోజు కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయనుండడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలు మూలల నుంచి, అదేవిధంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున చేరుకున్నారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిలాడాయి. గద్దెల ప్రాంగణం ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసిపోయింది.



తల్లుల వనప్రవేశం

తల్లుల వనప్రవేశం ప్రశాంతంగా జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సారలమ్మను కాక సారయ్య కన్నెపెల్లికి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు తరలించారు. దీంతో మేడారం మహాజాతర ముగి

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

ప్రముఖుల రాక

మేడారానికి శనివారం కూడా ప్రముఖుల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమ్మక్క, సారలమ్మను దర్శించి మొక్కులు చెల్లించారు. హెలిక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తుబంగారాన్ని సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సైతం వనదేవతలను దర్శించుకున్నారు.

ధన్యవాదాలు తెలిపిన సీతక్క

జాతరను విజయవంతం చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ శాఖల అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఇతరశాఖల అధికారులను అభినందించారు.

సంప్రదాయ ఊరేగింపు

సమ్మక్క, సారలమ్మ జాతర ముగుస్తుండడంతో చివరి రోజు శనివారం మేడారంలో ఆదివాసీలు సంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కోయ జాతుల వారు సుమారు 300 మంది సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం సమ్మక్క గద్దెల వద్దకు చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతిలో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో సంప్రదాయ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. శివసత్తులు పూనకాలతో శిగాలూగారు.

ముగిసిన మహాజాతర

అంగరంగ వైభవంగా సాగిన మేడారం మహాజాతర శనివారం ముగిసింది. నలుగురు దేవతల వనప్రవేశంతో నాలుగు రోజుల సంరంభానికి తెరపడింది. భక్తులు తిరుగుబాట పట్టడంతో మేడారంలో గుడారాలన్నీ ఖాళీ అయ్యాయి. జన ఘోషతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోయింది. 'రెండేళ్లకు మళ్లీ వస్తాం తల్లీ.. కరుణించు' అంటూ మొక్కుకుంటూ భావోద్వేగంతో స్వగ్రామాల బాట పట్టారు.



మేడారం వెళ్లే రహదారిపై బారులుదీరిన వాహనాలు

సల్లంగా చూడు మల్లన్న

- అంగరంగ వైభవంగా దేవుని కల్యాణం
- చల్లని అంబళ్ల కార్యక్రమం



మల్లన్న దేవుని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



చల్లని అంబళ్లతో వచ్చిన భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 24 : మండలంలోని ఎడ్‌బిడ్ మల్లన్న దేవునికి చల్లని అంబళ్ళను భక్తులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ప్రారంభమైన రెండవ రోజైన శనివారం ఎడ్‌బిడ్‌తో పాటు మండలంలోని వెంకటాపూర్, కారేగాం, చింతకుంట, చించాల, భైంసా మండలంలోని పుస్పూర్, కామోల్ గ్రామాల నుంచి భక్తులు కాలినడకతో చల్లని అంబళ్ళు నెత్తి పైన తీసుకువచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబ సభ్యులంతా సుఖ సంతోషాలతో ఉంటారని భక్తుల నమ్మకం. ఆలయంలో భక్తులు సత్యనారాయణ పూజలు చేశారు. అలాగే జాతర ప్రారంభమైన మొదటిరోజు బుధవారం రాత్రి దేవుని కల్యాణ మహోత్సవంను వేద పండితుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. మల్లన్న దేవుని కల్యాణం తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తరలివచ్చారు. నిర్వాహకులు, గ్రామస్థులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతర మంగళవారం వరకు కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో పండితులు వైభవ్, బసవరాజు, పూజారులు గొల్ల ఆశన్న, అశోక్, మండల ఉపాధ్యక్షులు లావణ్య రవీందర్‌రెడ్డి, సర్పంచ్ స్వర్ణలత, దత్తు, నాయకులు నిమ్మ పోతన్న, రాజారెడ్డి, విఠల్ రెడ్డి, మల్లేష్, విఠల్‌యాదవ్, సుధాకర్, కే. గురుప్రసాద్ యాదవ్, ఆలయ నిర్వాహకులు, వార్డుసభ్యులు, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ఉట్నూర్, ఫిబ్రవరి 24: ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఐదేళ్ల పాటు కృషి చేస్తానని, ఎవరు కూడా నిరుత్సాహానికి గురి కావద్దని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండలంలోని ఉట్నూర్ ఎక్స్‌రోడ్, పాత ఉట్నూర్, చాందోరిలలో నిర్వహించిన గొండి ధర్మగురు హీరాసుక్క జయంతి కార్యక్రమాలకు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. గిరిజన సంఘాల నాయకులు గిరిజనులను తప్పుతోవ పట్టించవద్దని, కొందరు నాయకులు అసత్య హామీలు ఇస్తూ గిరిజనులను మోసం చేస్తున్నారని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో గిరిజనులు గిరిజనేతరులు కలిసిమెలిసి జీవిస్తున్నారని, ఎలాంటి అపోహలకు గురి కావొద్దని ఆయన సూచించారు. ఉట్నూర్ ప్రాంతంలో ఇళ్లు లేని గిరిజనులకు ఇళ్లు ఇవ్వడానికి కావాల్సిన స్థలాలను అధికార యంత్రాంగం ద్వారా గుర్తిస్తామన్నారు. జైనూరు ప్రాంతంలో ఉన్న వారికి ఉట్నూర్‌లో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పడం సమంజసమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లలోనే చాలా మంది జీవిస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధాన్‌సేవా సంఘం నాయకులు మెస్రం మనోహర్, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, గేడం నీరంజన్, మెస్రం నాగరావు, మెస్రం కోసుపటేల్, చిలుకూరి జ్యోతిరెడ్డి, శంకర్ మహరాజ్, వెడ్మ కొద్దుపటేల్, సిడాం భీమావు, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

● ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్: మండల కేంద్రంలోని హజ్రత్ సయ్యద్ సాదాక్ పంజాబి రెహమతుల్లాలే దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం రాత్రి ఆడంబరంగా జరిగాయి. స్థానిక పాత బస్టాండ్ మీదుగా దర్గా ఉత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ హాజరై దర్గాలో చాదర్ కప్పి ప్రార్థనలు నిర్వహించారు.

రోగులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు

● మొదలైన వేసవి వ్యాధుల బెడద




భైంసా, ఫిబ్రవరి 24 : సీజన్ మారుతున్న నేపథ్యంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ పోతుంది. ఇదే క్రమంలో వాతావరణంలో వచ్చిన మార్పుల మూలంగా వేసవి వ్యాధుల బెడద మొదలైంది. అన్ని ప్రాంతాల్లోనూ ప్రస్తుతం విష జ్వరాలు, దగ్గు, దమ్ము, చర్మవ్యాధులు, డయేరియా తదితర రోగాల బెడద అధికమయ్యాయి. వ్యాధుల బారిన పడుతున్న వారందరూ వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రులకు తరులుతున్నారు. రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఏ ఆసుపత్రి చూసినా ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సేవల కోసం వచ్చిన రోగులే కనిపిస్తున్నారు. భైంసా ఏరియా ఆసుపత్రిలోని ఓపీ విభాగంలో ఇది వరకు రోజు 350 నుంచి 375 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తున్నారు. ప్రస్తుతం వేసవి వ్యాధుల బెడద అధికమైన నేపథ్యంలో రోగులసంఖ్య పెరిగింది. గత మూడు రోజులుగా ఓపీ విభాగంలో 450 నుంచి 470 వరకు రోగులు చికిత్సల కోసం ఆసుపత్రికి తరలివస్తున్నారు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వేసవి వ్యాధులపై అవగాహన కల్పించి ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు గాను చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

ముథోల్, ఫిబ్రవరి 24 : మండల కేంద్రమైన ముథోల్‌లోని కాల్వగల్లీకి చెందిన హంగిరిగొల్ల రాము(34) అనే రైతు తాగుడికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... అప్పుల బాధతో పాటు మృతుడు తాగుడికి బానిసయ్యాడు. తాగిన మైకంలో శుక్రవారం సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లి తన బంధువు చేనులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా శ్రీ సంత్ శిరోమణి సద్గురు రవిదాస్ మహారాజ్ జయంతి



సద్గురు ఆరాధనలో భక్తులు

ముథోల్, ఫిబ్రవరి 24 : మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం శ్రీ సంత్ శిరోమణి సద్గురు రవిదాస్ మహారాజ్ 647వ జయంతిని పురస్కరించుకొని మోచికుల సంఘం ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... సంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ బోధనలు ప్రతీ ఒక్కరూ తెలు సుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అన్ని మతాల సారం ఒక్కటేనని వెల్లడించారు. ఆయన భక్తి కవుల్లో ఒక ఆధ్యా త్మిక భావాన్నే కాకుండా సామాజిక భావా లను అభివృద్ధి చేశారన్నారు. మనిషి స్వతంత్రుడై గౌరవమైన ఆలోచనలతో జీవించాలని బోధించాడని, అట్టి మహానుభావుడి అడుగు జాడల్లో మనమందరం నడవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మోచి సంఘం పెద్ద సాయిలు, భూమేష్, భోజన్న, విఠల్, గంగాధర్, నరేష్, ఎంపీటీసీ దేవోజి భూమేష్, వరగంటి జీవన్, భాస్కరోళ్ల లవణ్, చరణ్, రవి, సాయి, శ్రీహరి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

తలమడుగు, ఫిబ్రవరి 24: మహిళలందరూ ఆర్థిక అభివృద్ధి చెందినప్పుడే కుటుంబం బాగుపడుతుందని డీఆర్‌డీఏ డీపీఎం గంగన్న అన్నారు. శనివారం మండలంలోని సుంకిడి రైతు వేదికలో మహిళలకు నిర్వహిస్తున్న దీదీ లక్షాధికారి రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాంసి, తలమడుగు ఏపీఎం స్వామి, ఐకేపీ ఏపీఎంలు, టీపీఎంలు శిక్షణ నిపుణులు పాల్గొన్నారు.

భీమన్న దేవున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 24: మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలో భీమన్నగుట్టపై ఉన్న భీమన్న దేవున్ని శనివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గారాం భీమన్న దేవుడిని మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొలుస్తారు. నూతనంగా నిర్మించిన షెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతి ప్రదానం చేశారు. ఇందులో బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివార్, రాథోడ్‌సజన్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడె వసంత్‌రావు, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

తలమడుగు, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ విద్యార్థులకు పొలిటిషన్ విధి విధానాలను, చట్టాలపై అవగాహన కల్పించారు. ఇదులో ఏఎస్‌ఐ సురేదర్, ఉపాధ్యాయులున్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

గుడిహత్నూర్, ఫిబ్రవరి 24 : మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కదం నారాయణ (41) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మృతుడు నారాయణ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించే వాడు. తన సొంత పనుల కోసం బయట అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రోజు ఆవేదన చెందేవాడు దీంతో మనస్థాపానికి గురై ఈనెల 18వ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.

లక్ష్మినారాయణ స్వామి వారి పాదాలను తాకిన సూర్యకిరణాలు



స్వామివారి పాదాలను తాకిన సూర్యకిరణాలు

జైనథ్, ఫిబ్రవరి 24: ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 18కి.మీ.ల దూరంలో ఉన్న జైనథ్ మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీలక్ష్మి నారాయణ స్వామి ఆలయంలో సూర్య కిరణాలు స్వామివారి పాదాలను తాకుతున్నాయి. శనివారం వేకువజామున లేలేత సూర్యకిరణాలు నేరుగా స్వామివారి పాదాలపై ప్రసవించాయి. దీంతో స్వామివారు బంగారు వర్ణంతో శోభాయమానంగా వెలుగుతు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 14వ శతాబ్దంలో పల్లవులు, జైనుల కాలంలో నిర్మించిన అతి ప్రాచీనమైన ఈ ఆలయంలో ప్రతియేటా స్వామి వారి పాదాలను అభిషేకించడం జరుగుతుందని స్థానికులు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి : ఎంపీ

బోథ్, ఫిబ్రవరి 24: గ్రామస్థాయి నుంచి ఆటలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎదగాలని ఎంపీ బాపురావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో వాలీబాల్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జివి.రమణ, విశ్వకర్మ యోజన జిల్లా కార్యదర్శి ఓబీసీ జిల్లా అధ్యక్షులు రాజు యాదవ్, జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ పందరం సుగుణ శంకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: అడవి జంతువుల వల్ల నష్టపోయిన రైతులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో నష్ట పరిహారం చెక్కులను ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపు రావు అందజేశారు. పట్టణంలోని ఎంపీ క్యాంపు ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

'పనికి హాజరయ్యేలా చర్యలు చేపట్టాలి'

ఇచ్చోడ, ఫిబ్రవరి 24: జాబ్ కార్డు ఉన్న ప్రతీఒక్కరు ఉపాధి హామీ పనులకు హాజరు కావాలని హాజరు కానివారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ సిబ్బందికి అదనపు డీఆర్‌డీవో కుటుంబరావు సూచించారు. చాలా గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీల క్షేత్రస్థాయి ఫొటోలు, అలాగే పనుల తాలూకు పత్రాలు అప్‌డేట్ చేయడంలేదని ఆయన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.


andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8, కనిష్ఠం 15.3

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

ఆదివారం 25 ఫిబ్రవరి 2024



ఫేక్ న్యూస్‌లపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 24: జిల్లా కలెక్టర్ ప్రొఫైల్‌తో వస్తున్న ఫేక్ న్యూస్‌లను ప్రజలు నమ్మవద్దని శనివారం జిల్ల కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పుడు ఫోన్ నెంబర్‌తో కలెక్టర్ ఫొటో ప్రొఫైల్ ఫేక్‌గా ఉపయోగించి కొందరు అధికారులను, ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని, ప్రజలు, అధికారులు నమ్మవద్దని పేర్కొన్నారు. అలాంటి మేసేజ్‌లు వస్తే వెంటనే ఉన్నతాధికారులకు, పోలీసు అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు.



ఇటీవల వాహనాలను తనిఖీ చేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు

రెచ్చిపోతున్న.. మైనింగ్ మాఫియా

- జిల్లాలో అడ్డూఅదుపు లేకుండా ఇసుక, మొరం, కంకర, మాంగనీస్‌ల అక్రమ తరలింపు
- అడ్డగోలుగా అమ్మేసుకుంటున్న వైనం
- మంచి ఆదాయమార్గంగా మారిన పెన్‌గంగా పరివాహక ప్రాంతం
- ఏటా కోట్లల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఇసుక, మొరం, కంకర తరలింపుపై నిఘా
- ఇకపై వాహనాలకు జియో ట్యాగింగ్
- ఆదాయ మార్గాలపై ప్రత్యేకదృష్టి సారించిన మైనింగ్ శాఖ
- స్పెషల్ డ్రైవ్‌లతో కొరడా ఝుళిపిస్తున్న సంబంధిత శాఖ అధికారులు
- జిల్లావ్యాప్తంగా ఎక్కడా అధికారికంగా లేని ఇసుక రీచ్‌లు, మొరం క్వారీలు

ఆదిలాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక, మొరం, కంకర, మాంగనీస్ అక్రమ తరలింపునకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. రెచ్చిపోతున్న మైనింగ్ మాఫీయా అడ్డగోలుగా అమ్మేస్తూ అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారు. దీంతో యేటా రూ.కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలో ఎక్కడా కూడా అధికారికంగా ఇసుక రీచ్‌లు, మొరం క్వారీలు లేకపోయినా.. యథేచ్ఛగా అక్రమ దందా సాగుతోంది. జిల్లా సరిహద్దుల్లో ప్రవహించే పెన్‌గంగా నది అక్రమార్కులకు మంచి ఆదాయమార్గంగా మారింది. ఈ ఏడు పెన్‌గంగా నదికి భారీ వరదలు రావడంతో పుష్కలంగా ఇసుక మేటలు అందుబాటులో ఉన్నాయి. వేసవి కాలం మొదలు కావడంతో నదిలో నీటి ఉధృతి తగ్గిపోయింది. ఇదే అదనుగా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న సరిహద్దు గ్రామాల వీడీసీలు టెండర్లు నిర్వహిస్తూ.. ఇసుక రీచ్‌లను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రం పరిసర ప్రాంతాలతో పాటు బేల, జైనథ్, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లో జోరుగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రీపగలు అనే తేడా లేకుండా మైనింగ్ మాఫియా అక్రమ రవాణా చేస్తూ రాయల్టీని ఎగ్గొట్టడంపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ శాఖ ఏడీలకు ఆదేశాలను జారీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన మైనింగ్ శాఖ అధికారులు గత నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తూ విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. అధికారులు కొరడా ఝుళిపించడంతో మైనింగ్ మాఫియా సైలెంట్టై పోయినట్లు కనిపిస్తుంది.

వాహనాలపై ప్రత్యేక నిఘా

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో మైనింగ్ రవాణా చేస్తున్న వాహనాలపై అధికారులు ప్రత్యేకదృష్టిని సారించారు. ఇప్పటికే సంబంధిత వాహనాల వివరాలను ప్రభుత్వానికి పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 63 కంకరను తరలించే భారీ వాహనాలతో పాటు 8 మాంగనీస్ వాహనాలను గుర్తించారు. దీంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సంబంధిత శాఖ చర్యలను ముమ్మరం చేసింది. త్వరలోనే ఈ వాహనాలకు జియోట్యాగింగ్‌ను ఏర్పాటు చేసి మైనింగ్ రవాణాపై దృష్టి సారించారు. ఇన్నాళ్లు అనుమతుల పేరిట అడ్డగోలుగా అక్రమ రవాణా సాగింది. ఇకపై జియో ట్యాగింగ్ అమల్లోకి వస్తే ఇలాంటి అక్రమ దందాలకు చెక్‌పెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో వాహనాలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు మైనింగ్‌ను తరలిస్తున్న విషయాన్ని సులువుగా తెలుసుకునే అవకాశం ఉందంటున్నారు. అలాగే అనుమతులు తీసుకున్న మేరకే ఇసుక, కంకర, మొరం, మాంగనీస్ తరలింపునకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఈ విధానం మహారాష్ట్రలో సత్ఫలితాలను ఇవ్వడంతో జిల్లాలో కూడా అమలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేవలం అధికారికంగా అనుమతులు ఉన్న క్వారీల వాహనాలను మాత్రమే గుర్తించి పరిగణలోకి తీసుకున్నారు. నిత్యం అనాధికారికంగా ఇసుకను తరలిస్తున్న వందలాది వాహనాలకు ఎలా అడ్డుకట్ట వేస్తారన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

అమల్లోకి ఈ-మైనింగ్ యాప్

ఆదాయ మార్గాలపై దృష్టి సారించిన మైనింగ్ శాఖ గత వారం రోజుల క్రితమే టీఎస్ ఈ-మైనింగ్ యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా లైవ్ లో అధికారులు వాహనాలను తనిఖీలు చేపట్టే అవకాశం ఉంటుంది. అలాగే రాయల్టీ విధింపు, వాహన వివరాలను సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా జనవరి 27 నుంచి ఫిబ్రవరి 22 నాటికి జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్న అధికారులు 12 ఇసుక వాహనాలను సీజ్ చేసి లక్షా 94వేల 780 రూపాయల జరిమానాను విధించారు. అలాగే 15 మొరం వాహనాలను పట్టుకుని రూ.లక్షా 16వేల 760 పెనాల్టీ వేశారు. కంకరను తరలించే ఏడు వాహనాలను సీజ్ చేసి రూ.26వేల 161, ఇటుకను తరలిస్తున్న రెండు వాహనాలపై రూ.33వేల 72ల పెనాల్టీని విధించారు. అంతేకాకుండా స్టోన్ క్రషర్లపై మరో రూ.80 వేల జరిమానాను విధించారు. ఇలా మొత్తం గడిచిన నెల రోజుల్లోనే మైనింగ్ శాఖకు రూ.4లక్షల 50వేల 773 ఆదాయం సమకూరింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనింగ్ శాఖపై పెద్దగా దృష్టి సారించి నట్లు కనిపించ లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మైనింగ్ శాఖలో కొత్త విధానాలను అమలు చేస్తూ ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఇసుక, మొరం, కంకర, ఇతర అక్రమ రవాణాలపై అధికారులు కఠినంగానే వ్యవహరించనున్నారు.

త్వరలోనే వాహనాలకు జియో ట్యాగింగ్

: రవిశంకర్, మైనింగ్ ఏడీ, ఆదిలాబాద్



ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో మైనింగ్‌ను సరఫరా చేస్తున్న వాహనాల వివరాలను ప్రభుత్వానికి పంపించడం జరిగింది. అంతేకాకుండా జిల్లాలో మొత్తం 71 వాహనాలను గుర్తించడం జరిగింది. ఈ వాహనాలకు త్వరలోనే జియో ట్యాగింగ్‌ను ఏర్పాటు చేస్తాం. దీంతో మైనింగ్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. గత నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తూ వాహనాల ను సీజ్ చేస్తున్నాం. రెవెన్యూ, పోలీసు శాఖల సహకారంతో మైనింగ్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం.

సంక్షిప్త సమాచారం



బాధ్యతలను స్వీకరిస్తున్న బి.సురేందర్‌రావు

అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 24: జిల్లా నూతన అదనపు ఎస్పీ ఆపరేషన్స్‌గా బి.సురేందర్‌రావు శనివారం పోలీసు ముఖ్య కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీ ఆపరేషన్ గతంలో అదనపు ఎస్పీ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ నుంచి బదిలీ అయ్యి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఆపరేషన్స్‌ని వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, కార్యాలయం అధికారి ఏవో భక్త ప్రహ్లాద, సిబ్బంది, డీసీఆర్‌బీ, ఎస్‌ఐబీ, ఫింగర్ ప్రింట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇందులో రిజర్వ్ ఇన్స్‌స్పెక్టర్‌లు టి.మురళి, నవీన్, సీసీ గిన్నెల సత్య నారాయణ, సిబ్బంది ప్రభుదాస్, లఖన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో

బోథ్, ఫిబ్రవరి 24: మండలంలోని దేవులా నాయక్ తండా గ్రామ ప్రత్యేక అధికారిగా శనివారం బోథ్ ఎంపీడీవో రమేష్ అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్యేక అధికారిగా తాను గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జాదవ్ సునీత, రోహిదాస్, పంచాయతీ కార్యదర్శి రాకేష్ తదితరులున్నారు.

28 నుంచి 144 సెక్షన్

ఉట్నూర్, ఫిబ్రవరి 24: ఈనెల 28 నుంచి పట్టణంలో ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి కాపీలకు ప్రోత్సహించవద్దని, పట్టణంలోని జిరాక్స్ సెంటర్లు ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు మూసి ఉంచాలని ఆదేశించారు. ఉట్నూర్‌లో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు.

'పూర్తి వేతనాలను చెల్లించాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 24: జీవో నెం.60 ప్రకారం పూర్తి వేతనాలు చెల్లిచాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి కార్మికులు చేపట్టిన ఆందోళన శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం ఎదుట ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. రిమ్స్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెకు వెళ్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవేందర్, నాయకులు హెచ్చరించారు.

'స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 24: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని పేర్కొన్నారు.

ఖైదీల్లో సత్ప్రవర్తనను తీసుకొస్తాం

- ఆదిలాబాద్‌లో నూతన పెట్రోల్ బంక్ ప్రారంభం





రిబ్బన్ కట్ చేసి పెట్రోల్‌బంక్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, పక్కన కలెక్టర్(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న డీజీ)


ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 24: ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకొచ్చేందుకు జైళ్ల శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జిల్లా జైలు వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. మొదట ప్రత్యేక పూజలు నిర్వహించి పెట్రోల్ పంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ జైలు ఖైదీలపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు పలు రకాల సంస్కరణలు చేపడుతున్నామని ఆమె పేర్కొన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఖైదీల శిక్షా కాలం పూర్తయ్యాక వారు సమాజంలో గర్వంగా జీవించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.జైళ్ల శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్‌పంప్‌ను ఖైదీలతో, జైలు నుంచి విడుదలై ఉపాధి లేకుండా ఉన్న వారితో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు జైళ్ల శాఖ ఆధ్వర్యంలో 38 పెట్రోల్ బంక్‌లను ప్రారంభించడం జరిగిందన్నారు. 12 బంకులు వ్యాపారరంగంలో మంచి ఆదరణ పొందాయని తెలిపారు. పోలీసులు విధి నిర్వాహణతో పాటు సామాజిక సేవా రంగంలోనూ కృషి చేయాలన్నారు.

- ఖైదీలకు జీవనోపాధి : కలెక్టర్

అనంతరం, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యతతో కూడిన ఇందనాన్ని అందించేందుకు ఖైదీలకు జీవనోపాధి కల్పించేందుకు పెట్రోల్ బంక్‌ను ప్రారంభించుకున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలో నేరాలు మరింత తగ్గి జిల్లా ప్రశాంతంగా మారుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా జైలుకు తమ నుంచి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇందులో ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎస్.మురళీబాబు, రాష్ట్ర జైళ్ల శాఖ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎం.సంపత్, అదనపు ఎస్పీ, బీపీసీఎల్ అధికారులు, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.అశోక్‌కుమార్, జైలు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాములగుట్ట జాతర

- అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం





జాతరలో జనం సందడి (ఇన్‌సెట్‌లో సీతారాముల మూర్తులకు కు పూజలు చేస్తున్న భక్తులు

తాంసి, ఫిబ్రవరి 24: గత ఐదు రోజుల నుంచి రాముల గుట్టపై నిర్వహించిన జాతర శనివారం సాయంత్రం ముగిసింది. ముందుగా 51 జంటలు 11 మంది వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య మహాయజ్ఞం నిర్వహించారు. 12.10 నిమిషాలకు సీతారాములకు కల్యాణం, నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ వేద మంత్రాల సాక్షిగా సీతా రాముల పాదాలపై తలంబ్రాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం నా లుగు గంటల ప్రాంతంలో రథోత్సవాన్ని నిర్వహించి జాతరను ముగింప జేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాకుండా పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి సైతం పెద్దఎత్తున భక్తులు హాజరై సీతా రాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అదేవిధంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి.. వచ్చిన ప్రతీ ఒక్కరికి ఎలాంటి సంఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మొత్తం మీద ప్రశాంతంగా జాతర ముగియ డంతో అటు నిర్వాహకులు, ఇటు పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 24: మండలం పరిధిలో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పను లకు భూమిపూజ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిపై రూ.3.20 కోట్ల వ్యయం నిధులతో కొల్హారి వద్ద వంతెన నిర్మాణానికి, సర్వశిక్ష అభియాన్ నిధుల నుంచి 8 లక్షల రూపాయలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, అలాగే కొల్హారి గ్రామపంచాయతీ భవన నిర్మాణాని కి ఐటీడీఏ నిధులు రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రాంభించారు. ఈ సందర్భంగా అనిల్‌జాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరిగిందని అన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో 15 కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీటీసీ లక్కం తిరుమల, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, తహసీల్దార్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని మహంకాళి ఆలయం ప్రహరీ, అలాగే రవీందర్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలకు అందించే వైద్య సేవల గురించి డాక్టర్ శ్యామ్‌సుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఆడె శీల, తిరుమల్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ముండే సంజీవ్, మాజీ సర్పంచ్‌లు జాదవ్ సునీత, రవి నాయక్, నాయకులు జాదవ్ రమేష్, దోమకొండ సుధాకర్, మాధవ్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు : రాథోడ్

తలమడుగు, ఫిబ్రవరి 24: ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే సిబ్బంది విధుల పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దని, గ్రామీణ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల ప్రజల కోసం ప్రభుత్వం ఎంతోగానో కృషి చేస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సిబ్బంది ముఖ్యంగా సమయ పాలన పాటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో రూ.కోటి యాభై లక్షలతో నిర్మిస్తున్న ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి డాక్టర్ హరీష్, డాక్టర్ వంశీ, తలమడుగు ఎంపీటీసీ చంటి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్